క్లుప్తంగా

నేడు కొమురవెల్లికి మంత్రి సీతక్క రాక

రెబ్బెన: మండలంలోని కొమురవెల్లికి సోమవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క రానున్నారు. పర్యటనలో భాగంగా కొమురవెల్లిలో సీసీరోడ్ల నిర్మాణ పనులకు సంబంధించిన శిలాఫలాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ మేరకు మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు మంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

సత్యసాయి చిత్రపటాలు అందజేత



సత్యసాయి బాబా ఫొటోలు అందజేస్తున్న సేవా సమితి సభ్యులు

కౌటాల: కౌటాల మండలం మొగడ్‌దగడ్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం 'ఇంటింటా సాయి' కార్యక్రమంలో భాగంగా కౌటాల, మొగడ్‌దగడ్ గ్రామాల్లో సత్యసాయి బాబా ఫొటోల వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యసాయి బాబా జన్మదినాన్ని పురస్కరించుకొని మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి భక్తులకు బాబా ఫొటోలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు గోపిశెట్టి అనిల్, గర్రెపల్లి ప్రభాకర్, శ్రీనివాస్, నరహరి, దిలీప్, మొండిరాం తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇందిరమ్మ మోడల్ హౌస్ ప్రారంభం

కౌటాల: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్‌హౌస్‌ను సోమవారం ప్రారంభించనున్నట్లు తహసీల్దార్ పుష్పలత ఆదివారం తెలిపారు. నేడు సాయంత్రం 4.15 గంటలకు రాష్ట్ర పంచాయతీ రాజ్ మంత్రి సీతక్క, కలెక్టర్ వెంకటేశ్‌దోత్రేతో పాటు ప్రజాప్రతినిధులు మోడల్ ఇంటిని ప్రారంభిస్తారని తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చింతలమానెపల్లి: మండలంలోని రవీంద్రనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ అంజల్ కుమార్ తెలిపారు. రవీంద్రనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రెండు సెల్‌ఫోన్‌లు అప్పగింత



సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న ఎస్సై ప్రశాంత్

వాంకిడి: మండలంలోని కోమటిగూడకు చెందిన వినేశ్, బంబార గ్రామానికి చెందిన బిక్కు అనే వ్యక్తులు ఇటీవల వారి సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను గుర్తించి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం బాధితులకు ఎస్సై ప్రశాంత్ ఆధ్వర్యంలో వాటిని అప్పగించారు. ఎవరైనా ఫోన్లు పోగొట్టుకుంటే వెంటనే ఫిర్యాదు నమోదు చేయాలని ఎస్సై అన్నారు. మొబైల్స్‌ను ట్రేస్ చేయడంలో ప్రతిభ కనబర్చిన కానిస్టేబుల్ నయీమ్‌ను అభినందించారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి



ఎద్దు కళేబరం

దహెగాం: మండలంలోని కర్జి గ్రామానికి చెందిన జునుగరి సత్తన్న అనే రైతుకు చెందిన ఎద్దు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం ఎడ్లను మేతకు వదిలాడు. గ్రామ సమీపంలో వ్యవసాయ పొలంలో ఎద్దు మేస్తున్న క్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైరుకు తగిలి అక్కడికక్కడే మృతి చెందిందని పేర్కొన్నారు. వ్యవసాయ పనులు చేసుకునే ఎద్దు మృతి చెందడంతో వ్యవసాయానికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని వాపోతున్నారు. ఎద్దు విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందన్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

దంచి కొడుతున్న ఎండలు

ఎండ నుంచి రక్షణకు స్కార్ఫ్ కట్టుకున్న మహిళ



దహెగాంలో చెట్ల నీడన సేదతీరుతున్న ప్రజలు



నిర్మానుష్యంగా దహెగాం మార్కెట్ ఏరియా



వాతావరణంలో మార్పుల వల్ల అక్కడక్కడ ఈదురు గాలులతో వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలు లేని ప్రాంతాల్లో ఎండలు దంచికొడుతున్నాయి. దహెగాం మండలంలో కొద్ది రోజుల క్రితం చిరుజల్లులు కురిశాయి. కాగా గత మూడు రోజులుగా ఎండల తీవ్రత పెరిగింది. మండలంలో 40 నుంచి 41 డిగ్రీల ఎండ తీవ్రత ఉండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. పెళ్లిళ్ల సీజన్ కావడంతో వివాహాలకు వెళ్లే వారు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 11 గంటలకే మార్కెట్ ఏరియా నిర్మానుష్యంగా మారుతోంది. ఎండ నుంచి రక్షణకు ప్రజలు తలపాగ, మహిళలు స్కార్ఫ్ కట్టుకుంటున్నారు. ఇళ్లలో ఉన్నవారు ఉక్కపోతకు కూలర్లు, ఏసీలు వినియోగిస్తున్నారు. - దహెగాం

జొన్న కోతలు షురూ!



ఈ మహిళా రైతు పేరు మోహర్లే భూదేవి. గడిచిన పదేళ్లుగా రబీలో జొన్న పంట సాగు చేస్తోంది. ఏటా మార్కెట్‌లో పెరుగుతున్న జొన్న ధరల నేపథ్యంలో జొన్నలు కొనలేని పరిస్థితులు ఉన్నాయని, దీంతో తానే జొన్న పంట సాగు చేస్తున్నట్లు పేర్కొంది. పశువుల మేతకు జొన్న చొప్ప ఉపయోగపడుతుందని, ఇంట్లో జొన్న రొట్టెలతో పాటు గట్కా ఆరగించడం వల్ల ఆరోగ్యంగా ఉండొచ్చని తెలిపింది.

- ఏటా పెరుగుతున్న సాగు
- మండలంలో 2,448 ఎకరాల్లో సాగు
- తగ్గనున్న పశుగ్రాసం ధరలు



సాకడలో జొన్న పంట కోస్తున్న రైతులు



చొప్పకట్టలు కడుతున్న రైతులు

కెరమెరి: మండలంలోని వివిధ గ్రామాల్లో జొన్న కోతలు ప్రారంభమయ్యాయి. నానాటికీ మార్కెట్‌లో పెరుగుతున్న జొన్న ధరలతో విసుగు చెందిన అన్నదాతలు ఆహార పంటలు పండిస్తున్నారు. వానాకాలంలో పత్తి పండించిన రైతులు పంట చేతికొచ్చాక రబీలో జొన్న, మొక్కజొన్న పంటలు సాగు చేశారు. నీటి సౌకర్యం ఉన్న రైతులు ఎక్కువగా జొన్న పంట సాగు చేశారు. ఈనేపథ్యంలో ప్రస్తుతం మండలంలో జొన్న పంట కోతలు ప్రారంభమయ్యాయి.

2,448 ఎకరాల్లో సాగు..

మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 8194 మంది రైతులు ఉండగా.. 29,456 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. గతేడాది 1000 ఎకరాల్లో కూడా లేని జొన్న సాగు ఈసారి 2448 ఎకరాలకు పెరిగింది. 200 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ప్రస్తుతం ఎలాంటి వానలు పడకపోయినప్పటికీ ఆరుతడి పంటల్లో భాగంగా మొక్కజొన్న అధికంగా పండిస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో 500లకు పైగా మంది రైతులు తమ పొలాల్లో బోర్లు వేసి జొన్న పంట పండించారు. ప్రస్తుతం మార్కెట్‌లో జొన్నలు కిలో రూ.40 నుంచి రూ.45 వరకు పలుకుతున్నాయి. కాగా ప్రస్తుత కాలంలో చాలా మంది ఆరోగ్య నిమిత్తం జొన్న రొట్టెలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో జొన్నలకు డిమాండ్ బాగా పెరిగింది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్న రైతులు ఈ కాలంలో జొన్న సాగుపై ఆసక్తి చూపారు.

రబీ జొన్నకు డిమాండ్..

ఆరోగ్యానికి రబీలో వేసిన జొన్నలు మంచివని భావించిన రైతులు సుమారు 234 మంది జొన్న సాగు చేశారు. రబీలో సాగు చేసిన జొన్న చొప్పకు కూడా ధర ఎక్కువగానే ఉంటుంది. హైబ్రిడ్ చొప్ప కట్టకు రూ. 15 పలికితే.. రబీ జొన్నకు రూ.25 నుంచి రూ. 30లు పలుకుతోంది.

ఆహార పంటలపై దృష్టి పెట్టాలి

"రైతులు పత్తి పంటతో పాటు జొన్న, మొక్కజొన్న, కంది, పెసర వంటి ఆహార పంటలు పండించాలి. ప్రతీ రైతు తనకున్న సాగు భూమిలో కనీసం నాలుగో వంతు ఆహార పంటల కోసం కేటాయిస్తే ఎంతో మంచిది."

– యుగేందర్, ఏవో, కెరమెరి

నిర్మాణం.. అలంకార ప్రాయం!



కెరమెరి: మండలంలోని నాగల్‌గొందిలో రూ.10 లక్షలు వెచ్చించి పదేళ్ల క్రితం నిర్మించిన కమ్యూనిటీ భవనం అలంకార ప్రాయంగా మారింది. గిరిజన ఆదివాసీలు ప్రత్యేక సమావేశాలతో పాటు, ఇతర కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన ఈ భవనంలో ఇప్పటి వరకు ఒక్కసారి కూడా సమావేశం జరగలేదు. లక్షలు వెచ్చించి నిర్మించిన భవనం ఎందుకూ పనికి రాకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రి ఖర్చులను ప్రభుత్వమే భరించాలి

ఆదిలాబాద్: పేద ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేసుకుంటే ఆ ఖర్చులన్నీ ప్రభుత్వమే భరించేలా చూడాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఏవైనా పెద్ద అనారోగ్య సమస్యలు తలెత్తితే నిరుపేదలు అప్పుల్లో కూరుకుపోతున్నారన్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలో మెరుగైన చికిత్స చేసుకుంటే రూ. లక్షల్లో బిల్లులు అవుతున్నాయన్నారు. అయితే సీఎంఆర్ఎఫ్ ద్వారా కేవలం రూ.65 వేల వరకు మాత్రమే ఆర్థిక సహాయాన్ని అందించడం జరుగుతుందన్నారు. దీంతో నిరుపేదలకు వైద్యం అందని ద్రాక్షగా మిగిలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ముందు జాగ్రత్తగా హెల్త్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు.

పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని భాగ్యనగర్ కాలనీకి చెందిన యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై ప్రశాంత్ కథనం ప్రకారం.. యువతి (17)ని తల్లిదండ్రులు పనుల నిమిత్తం తీసుకువెళ్లడానికి ప్రయత్నం చేయగా గత కొంత కాలంగా ప్రతీరోజు నిరాకరిస్తుంది. ఈక్రమంలో రోజువారీగా పనికి వెళ్లమని తల్లిదండ్రులు సూచించారు. ఈ క్రమంలో మనస్తాపం చెందిన యువతి పురుగుల మందు తాగింది. తల్లిదండ్రులు గమనించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో ఆదివారం మృతిచెందింది. తల్లి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అఖండం హరినామం..!



సంకీర్తనలు ఆలపిస్తున్న బృందం



హాజరైన భక్తులు

- మూడు రోజుల పాటు ఉత్సవాలు
- లోక కల్యాణం కోసం 19 ఏళ్లుగా ఉత్సవాలు

చింతలమానెపల్లి: లోక కల్యాణం కోసం నిర్వహిస్తున్న అఖండ హరి నామ సంకీర్తన మహాయజ్ఞం భక్తులను ఆకట్టుకుంటోంది. మండలంలోని రవీంద్రనగర్2లో ఆదివారం గౌరంగా విదుర్ జయంతి ఉత్సవాలు ప్రారంభించారు. స్థానిక శ్రీశ్రీ రాధా గోపినాథ్ సేవా కుంజ్ మందిరంలో మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భగవత్ పథ్, ఖోల్ మంగల్ ఆదివాస్‌తో కళశ స్థాపన నిర్వహించారు. రాధాకృష్ణుల దేవతా విగ్రహాలను సాంప్రదాయ రీతిలో ఏర్పాటు చేశారు. చత్తీస్‌ఘడ్, ఒరిస్సా తదితర ప్రాంతాల నుంచి వచ్చిన కళా బృందాల ఆధ్వర్యంలో హరినామ సంకీర్తనలు ఆలపిస్తున్నారు. 72గంటల పాటు హరినామ సంకీర్తనతో పాటు లిఖిత జపం, స్మరణ జపం నిర్వహిస్తున్నారు. కార్యక్రమం జరిగే మూడు రోజుల పాటు భక్తులకు నిరంతరం మహాప్రసాదం అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాలను గ్రామంలో గత 19 సంవత్సరాలుగా నిర్వహిస్తుండడం విశేషం.

నేటి నుంచి జొన్నల కొనుగోళ్లు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం నుంచి ప్రభుత్వ మద్దతు ధరతో జొన్నలు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు సహకార సంఘం సీఈవో రాథోడ్ ఈశ్వర్ తెలిపారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే రైతులు తాము పండించిన జొన్నలను వ్యవసాయ మార్కెట్‌కు తీసుకొని రావాలని కోరారు. ఈనెల 12న మండలంలోని జున్ని, కామాగిరి, అడేగామ(బి), అడేగామ(కె) గ్రామాల రైతులు తమ పండించిన జొన్నలను మార్కెట్‌కు తీసుకొని రావాలని కోరారు. ఈనెల 15న కోకస్‌మన్నూర్, ముఖరా(బి), ముఖరా(కే). 19న దర్మంపూరి, గుండివాగు, గుండి. 22న మాన్కపూర్, నవేగాఫ్, సల్యాద. 26న చించోలి, గేర్జం, జల్దా, జామిడి, నర్సాపూర్, దాబా కే. 28న దాబా(బి), హిరపూర్, మాదపూర్, తలమద్రి, గాయిద్‌పల్లి గ్రామాల రైతులు జొన్నలను మార్కెట్‌యార్డుకు తీసుకొని రావాలని కోరారు.

సమస్యలకు పరిష్కారం దక్కేనా?

- మంత్రి పర్యటనతో ఆశలు



శివపెల్లి గ్రామానికి వెళ్లే దారిలో వంతెన లేని వాగు

చింతలమానెపల్లి: చింతలమానెపల్లి మండలానికి సోమవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క రానున్నారు. డబ్బా గ్రామంలో గిరిజనుల ఆరాధ్య దైవం కుమురంభీం విగ్రహావిష్కరణ చేయనున్నారు. ఈనేపథ్యంలో మండలంలోని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని మండలవాసులు ఆశలు పెట్టుకున్నారు.

రవాణా ఇబ్బందులు..

చింతలమానెపల్లి మండలం నూతనంగా ఏర్పాటు చేసి సుమారు 10 సంవత్సరాలు గడుస్తోంది. కానీ మండలంలో రవాణా సమస్యలు పరిష్కారం కాకుండా ఉన్నాయి. మండలంలోని ప్రధాన రహదారులు గుంతలమయంగా ఉండగా, పలు గ్రామాలకు వంతెనలు లేవు. వంతెనలు మంజూరైనా అసంపూర్తిగా ఉన్నాయి. మండంలంలోని రణవెల్లి గ్రామానికి సమీపంలోని వాగుపై లోలెవల్ వంతెన ఉండగా హైలెవల్ వంతెన నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇవేకాకుండా పెండింగ్‌లో ఉన్న వంతెనలు పూర్తి చేయాలని వేడుకుంటున్నారు.

విద్యా వసతులు కరువు..

మండలంలోని పాఠశాలల్లో మన ఊరు మన బడి పేరిట నిర్వహించిన పనులు అసంపూర్తిగా ఉన్నాయి. డబ్బా, రవీంద్రనగర్, చింతలమానెపల్లి, బాబాసాగర్ ఉన్నత పాఠశాలల్లో అసౌకర్యాలు రాజ్యమేలుతున్నాయి. మండలంలో ఇంటర్ మీడియట్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. ఏటా వందల సంఖ్యలో విద్యార్థులు సరైన వసతులు లేక చదువు మధ్యలో ఆపేస్తున్నారు. గూడెం, రణవెల్లి, రుద్రాపూర్, ఖర్జెల్లి, గ్రామాలలో పాఠశాలలను 10వతరగతికి అప్‌గ్రేడ్ చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. మండలంలో బాలుర, బాలికల గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తే మండలం విద్యాపరంగా అభివృద్ధి బాట పడుతుంది. కాగా రవీంద్రనగర్‌లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఈ ఆరోగ్య కేంద్రంలో రెగ్యులర్ వైద్యాధికారి గత కొద్ది నెలలుగా నియమించలేదు.

కార్యాలయాలు లేక తిప్పలు..

మండలంలోని అధికారిక కార్యాలయాలకు భవనాలు లేవు. మండలం ఏర్పాటైన సంవత్సరంలో మండలంలో తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు శాశ్వత భవనం మంజూరైంది. ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలు శిథిల భవనాల్లో కొనసాగుతున్నాయి. విద్యాధికారికి దుబ్బగూడ పాఠశాలలో ఒక గదిని కేటాయించారు. మండల వ్యవసాయాధికారి బాలాజీ అనుకోడ రైతు వేదిక నుంచి విధులు నిర్వహిస్తున్నారు. మండలంలో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించడానికి సమావేశాలకు సైతం ఇదే రైతు వేదిక దిక్కుగా మారింది. మండలంలో అభివృద్ధి పనులను పర్యవేక్షించడానికి ఇంజినీరింగ్ అధికారులకు భవనాలు నిర్మించాల్సిన అవసరం ఉంది. నూతన మండలంగా ఏర్పాటైన చింతలమానెపల్లి మండలంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క శాఖల వారీగా అభివృద్ధి పనులపై సమీక్ష జరపాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా పోచమ్మ బోనాలు







చింతలమానెపల్లి: మండలంలోని రుద్రాపూర్ గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాలు వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని పోచమ్మ ఆలయంలో పోచమ్మ, మహాలక్ష్మి, పోతురాజు నూతన విగ్రహమూర్తుల ప్రతిష్ఠాపన సందర్భంగా మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించారు. బోనాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఆలయం వద్ద అగ్నిగుండాలలో భక్తులు ప్రవేశం చేశారు. పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరు కావడంతో ఆలయం రద్దీగా మారింది. అనంతరం నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు.